ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024





ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

4.03 లక్షల టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం

జిల్లాలో 306 కేంద్రాల ఏర్పాటు

క్వింటాలుకు రూ. 117 పెరిగిన మద్దతు ధర

సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ఈ వానా కాలం సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో కూడా 306 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4 లక్షల 3 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో 3 కోట్ల 16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 87 వేల టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ నిర్ణయించారు.

వరికి ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,09,562 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఇందులో దొడ్డు రకం వరి 36,676 ఎకరాల్లో సాగు చేయగా, సన్న రకం 1,72,879 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 78.79 శాతం సన్న రకం పంటను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా వరి సాగు వల్ల 4 లక్షల 49 వేల 554 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, ఇందులో దొడ్డు రకం 91 వేల 700 టన్నులు, సన్న రకం 3 లక్షల 97 వేల 615 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. సన్న రకం ధాన్యం దిగుబడిలో 10 శాతం తిండి అవసరాలకు పోనూ 3 లక్షల 57 వేల 853 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ మొత్తం కేంద్రాలకు వస్తే మాత్రం క్వింటాలుకు 500 రూపాయల చొప్పున 178 కోట్ల 92 లక్షల రూపాయల బోనస్ భారం ప్రభుత్వంపై పడనున్నది. ఈ ఏడాదికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం కామన్ రకం వరి ధాన్యం క్వింటాలుకు 2300 రూపాయలు కాగా, గ్రేడ్ ఏ రకం 2,320 రూపాయలు. అయితే సన్న రకం ధాన్యాన్ని కామన్ గ్రేడ్ కింద తీసుకుంటారా, గ్రేడ్ ఏ కింద తీసుకుంటారా అనే విషయమై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు.

గత ఏడాదికంటే..

గత ఏడాదికంటే ఈ ఏడాది మద్దతు ధర క్వింటాలుకు 117 రూపాయలు పెరిగింది. రైతులకు ప్రతి సీజన్‌లో ప్రభుత్వం విధించిన మద్దతు ధరలు దక్కేందుకు ప్రభుత్వమే ధాన్యాన్ని ఐకేపీ సంఘాల ద్వారా 56, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 245, వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా ఈ సీజన్‌లో కూడా ప్రభుత్వమే నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిశ్చయించింది. వచ్చేనెల మొదటి వారంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎం సివిల్ సప్లయ్, డీఎస్‌వో, డీఆర్‌వో, డీసీవో తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అందుబాటులో ఉన్న గన్నీ సంచులకు తోడు మరిన్ని సంచులను తెప్పించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. వర్షాకాలం కావడంతో కేంద్రాల్లో ధాన్యం తడిసే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో కావాల్సిన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, ధాన్యం తూకం వేసే యంత్రాలు, ధాన్యం తేమ శాతాన్ని కొలిచే యంత్రాల కోసం మార్కెటింగ్ శాఖాధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యాన్ని నిర్ధారించేందుకు మైక్రో మీటర్లను తెప్పించాలని నిర్ణయించారు. జిల్లాలో వర్షాకాలం ఆరంభంలో వ్యవసాయ బావుల కింద వేసిన వరి పంట ముందుగా కోతకు రానున్నది. మరో నెల రోజుల్లో వరి కోతలు ఆరంభమై నవంబర్ నాటికి ముమ్మరం కానున్నాయి. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో కోతలు కూడా ఆలస్యం కానున్నాయి. బురద పొలాల్లో వరి కోసేందుకు చైన్ మిషన్లు తక్కువగా ఉండడం వల్ల వరి కోత యంత్రాలు దిగబడతాయి కాబట్టి కోతలు ఆలస్యం కానున్నాయని రైతులు చెబుతున్నారు.

చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

శ్రీకాంత్, డీఎం పౌరసరఫరాల సంస్థ



చివరి గింజ వరకు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తాం. ఈ వానాకాలం సీజన్‌లో రైతు లు పండించిన వరి ధాన్యంలో 4 లక్షల 3 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. కావాల్సిన గన్నీ సం చులు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్ వంటి యంత్రాలను సిద్ధం చేస్తు న్నాం. ఈసారి జిల్లాలో రైతులు ప్రభుత్వ సూచన మేరకు సన్న రకం ధాన్యాన్ని ఎక్కువగా సాగు చేశారు. సన్న రకం ధాన్యాన్ని నిర్ధారించేందుకు మైక్రో మీటర్లను తెప్పిస్తున్నాం. ఈసారి సన్న, దొడ్డు రకం ధాన్యం 3.50 లక్షల టన్నులకు పైగా కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలున్నాయి.

రేపు జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి హేమంత్ కుమార్

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 26: జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 28న నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి హేమంత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె స్వప్నరాణితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 28న జిల్లాలో గల అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ జరగనున్నదని తెలిపారు. లోక్ అదాలత్‌ను ప్రతి కక్షిదారుడు వినియోగించుకోవాలని, కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా రాజీ చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, ఇన్స్‌రెన్స్ న్యాయవాదులు లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పోలీస్, మోటార్ వెహికల్ యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, ఎలక్ట్రిసిటీ అథారిటీకి సంబంధించిన, మనీ రికవరీ, సివిల్, మున్సిపాలిటీకి సంబంధించిన కేసులను కూడా రాజీ మార్గం ద్వారా రాజీ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో సుమారు 1400 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబర్ 26 : వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ కుమార్, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కాగా, రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక తిలక్‌నగర్‌లో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి చాకలి ఐలమ్మ త్యాగాలను కొనియాడారు. అనంతరం తిలక్‌నగర్ రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీకి కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి స్థానికేతరులను బయటకు పంపండి

- సీజీఎంకు కాంగ్రెస్ నాయకుల వినతి

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల వారిని బయటకు పంపాలని, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కాంగ్రెస్ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచనలతో గురువారం నగర మేయర్ బంగి అనీల్ కుమార్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆర్‌ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌రాజ్ హన్సన్‌ను కలిసింది. ఈ మేరకు వినతిపత్రం అందించారు. సీజీఎంను కలిసిన వారిలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, నాయకులు కొక్కిరాల శ్రీనివాసరావు, కందుల సతీష్, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాష్, పాతిపెల్లి ఎల్లయ్య, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, దూళికట్ట సతీష్, సాంబమూర్తి, సింహాచలం, కౌటం సతీష్ పాల్గొన్నారు.

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు గైర్హాజరవుతున్న హెచ్‌వోడీలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు అందించాల్సిన హెచ్‌వోడీలు విధులకు ఎగనామం పెడుతున్నారు. ముఖ్య అధికారి ఉన్నప్పుడే విధులకు హాజరవుతూ మిగతా సమయాల్లో స్థానికంగా ఉండడం లేదనే విమర్శలున్నాయి. 13విభాగాల్లో పని చేసే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సకాలంలో విధులకు రావడం లేదు. ముఖ్య అధికారి కళాశాల పనిమీద హైదరాబాద్‌కు వెళితే వీరు కూడా తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. కలెక్టర్ ఆసుపత్రిలో జరుగుతున్న పరిణామాలపై సమావేశం ఏర్పాటు చేయాలని సూచించడంతో మూడు రోజుల క్రితం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ సమావేశం నిర్వహించగా ముగ్గురు హెచ్‌వోడీలు మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో ఐదుగురు ఆర్‌ఎంఓలు, ముగ్గురు హెచ్‌వోడీలు మాత్రమే పాల్గొన్నారు. సమావేశానికి మూడు రోజుల ముందు వైద్యులకు మేయర్‌కు సమాచారం పంపగా విభాగాల అధిపతులు సమావేశానికి డుమ్మా కొట్టారు. సమావేశంలో తమపై పని భారం పడుతోందని వైద్యులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఆరోగ్య శాఖ మంత్రికి మేయర్ నివేదిక..

ఆసుపత్రిలో జరుగుతున్న పరిణామాలపై మేయర్ బంగి అనీల్ కుమార్, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నివేదిక పంపారు. రోగులకు సరైన వైద్యం అందించడంలేదని, చాలా మంది హెచ్‌వోడీలు విధులకు గైర్హాజర్ అవుతున్నారంటూ మంత్రికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. ఉన్నవారిపై అదనపు భారం పడుతుందని, కాంట్రాక్టు వైద్యులను నియమించాలని మంత్రి దామోదర రాజనర్సింహకు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు నివేదించారు.

సర్టిఫికెట్లను ప్రదానం చేసిన ఎమ్మెల్యే



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: మండలంలోని భూపతిపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం ఎల్‌ఎండీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్‌ఏజీ టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం విద్యాలయంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మేనేజర్ విజయశ్రీ, జిల్లా మేనేజర్ జయశ్రీ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవిత, స్పెషల్‌ఆఫీసర్ స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కవ్వంపల్లి జమున తిరుపతి, మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, బల్మూరి వెంకట్ రమణారావు, కల్లెపల్లి జానీ,పులి వెంకటేశం, చిలుక సతీష్ తదతరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

మంథని, సెప్టెంబర్ 26: మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి కోసం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో గద్దలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సృజన్, వైద్య సిబ్బంది ఆరోగ్య, రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి అభయ కార్డులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మనోహర్, కౌన్సిలర్లు లింగయ్య, నాగేంద్ర, వీకే రవి, డాక్టర్ శివాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి



వైద్య పరీక్ష చేయించుకుంటున్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, సెప్టెంబర్ 26: ప్రజల ఆరోగ్యం కోసం స్థానికంగా ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. స్థానిక చంద్రుపట్ల రాంరెడ్డి కాంప్లెక్స్‌లో బీజేపీ పార్టీ పిలుపు మేరకు సేవ పక్ష కార్యక్రమంలో భాగంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, మహాత్మాగాంధీల జయంతిలను పురస్కరించుకొని రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును గురువారం చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను భారతీయ జనతా పార్టీ కొనసాగిస్తుందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యాంపులో ఆర్థో, జనరల్ వైద్య పరీక్షలు, సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 26 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం మండలంలోని హన్మంతునిపేట, ముత్తారం గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హన్మంతునిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివింది అర్థం చేసుకునేలా విద్యార్థుల గ్రహణశక్తి మెరుగయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలో మరమ్మతుకు గురైన కంప్యూటర్లను తొలగించాలని, విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందజేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని, పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముత్తారం అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మరో భవనంలోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను రెగ్యులర్‌గా మానిటర్ చేయాలని, ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన అదనపు పౌష్టికాహారం అందజేయాలని ఆదేశించారు. పాఠశాల హెడ్‌మాస్టర్లు జి. దశరథం, పి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ నియామకాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 26 : జిల్లా కేంద్రంలోని స్వరూప గార్డెన్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు గురువారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు నియామకాలపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్నివీర్‌వాయు నియామకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ ఎన్. సందీప్, ఎస్.కె. జైనా(ఎన్.సి.ఓ)లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్ పి మైత్రేయి, ఎస్. రామచంద్రారెడ్డి, జి. రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: మండలంలోని పూసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి రాజయ్య తనిఖీ చేశారు. ప్రార్థన సమయానికి ఎంఈఓ స్కూల్‌కు చేరుకుని ప్రార్థనలో పాల్గొన్న అనంతరం విద్యార్థుల హాజరుపట్టిక పరిశీలించారు. అత్యధికంగా హాజరు శాతం కలిగి ఉన్న ఇద్దరు విద్యార్థులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజయ్య తొలిసారిగా పూసాల స్కూల్‌కు వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉమారాణి, మహేష్, సతీష్, లక్ష్మయ్య, తిరుపతిరావు, స్వర్ణలత, సారయ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సన్మానం

నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంఈవో రాజయ్యను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల విద్యాధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, జిల్లా కార్యదర్శి రాజేశం, ఆసోసియెట్ అధ్యక్షుడు శివశరణం, దూడల సురేష్, విద్యాసాగర్, కృష్ణమూర్తి, వీణ, నాగజ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థినుల ప్రతిభ

- 20 బంగారు, 4 వెండి పతకాలు కైవసం..



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 26 : హైదరాబాద్‌లో ఈనెల 22న జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే, తైక్వాండ్ పోటీల్లో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందనలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి 24 మంది బాలికలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వివిధ కేటగిరీలలో బాలికలు 20 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు సాధించారన్నారు. శిక్షణ అందించిన మాస్టర్లను అభినందించారు.

ఎమ్మెల్యేను విమర్శించే హక్కు చందర్‌కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను విమర్శించే హక్కు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు లేదని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో డబ్బులు పెట్టి మోసపోయిన ఐదుగురు చందర్ పేరు చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 700మంది వద్ద కోట్ల రూపాయలను దండుకున్న చందర్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాక ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓసీపీలను చేస్తే కుర్చీ వేసుకుని కూర్చుంటానని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఓసీపీలను తవ్వి రామగుండాన్ని బొందల గడ్డగా చేశారని ఆరోపించారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న చందర్ రామగుండం ప్రజలకు కనీసం మంచినీటిని తాగించలేదని, ప్రజలకు పాయఖాన నీళ్లు తాగించారని, ఇక్కడ ఉన్న ఓబీ కంపెనీలతో లాలుచిపడి స్థానికులకు ఉద్యోగాలు ఇప్పించలేదన్నారు. రామగుండం ప్రజలు మక్కాన్‌సింగ్‌ను భారీమెజార్టీతో గెలిపించారన్నారు.చందర్ రూ.100 కోట్ల నిధులు తీసుకువచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నాడని, అవి కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని, గెలిచిన తొమ్మిది నెలల్లో మక్కాన్ సింగ్ రామగుండం అభివృద్ధికి రూ.100కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులను కూడా ప్రారంభించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా, కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, దూళికట్ట సతీష్, కౌటం సతీష్, గట్ల రమేష్, నజీమొద్దీన్, కుడుదుల శివ, సింహాచలం, మిడిదొడ్డి ప్రవీణ్, ఇండ్ల ఓదెలు పాల్గొన్నారు.



యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటనపై వీడియో వైరల్

- ఎస్సై వేధింపులే కారణమంటూ బంధువుల ఆరోపణ - విచారణ చేపట్టిన పోలీస్ శాఖ?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26: కుటుంబ కలహాలతో ఈనెల 23న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోరుట్ల ఎస్సై దాడి చేయడంతోనే తన సోదరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రశాంతి ఆరోపిస్తోంది. ఈ ఘటనపై శివప్రసాద్ సోదరి ప్రశాంతి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియో బుధవారం నుంచే జగిత్యాల జిల్లాలో వైరల్ అవుతోంది.

శివప్రసాద్‌కు తన భార్యకు మధ్య వివాదం జరగడంతో ఈనెల 22న కోరుట్ల పోలీసులు ఫిర్యాదు మేరకు శివప్రసాద్‌ను పిలిపించారు. ఆ మరుసటి రోజే శివకుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే ఎస్సై దాడి చేయడంతోనే ఈ ఘటన జరిగినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు విడుదల చేసిన వీడియో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీస్ శాఖ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ నెల 22న కోరుట్ల పోలీస్ స్టేషన్ లో అసలు ఏమి జరిగింది అనే కోణంలో పోలీస్ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని దాచారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌరవేని రాజును రిమాండ్‌కు తరలించినట్లు, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు

ఎల్లారెడ్డిపేటలో చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో తాళం వేసి ఉన్న మొగుళ్ల మల్లేశం ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తాళం బద్ధలు కొట్టిన చోరులు లోనికి ప్రవేశించి బీరువాలను ధ్వంసం చేశారు. బీరువా తెర చుకోకపోవడంతో అక్కడ నుంచి జారుకున్నారు. మండల కేంద్రంలో ఇంటి ఎదుట నిలిపిన ఎర్రవెళ్లి కృష్ణకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎస్‌యూలో సమస్యలను పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూ సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఉపకులపతి సురేంద్ర మోహన్‌కు ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలోని 14 కోర్సులో ఎనిమిది కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌గా ఉండడం వల్ల బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక పోతున్నారన్నారు. కోర్సులని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. విశ్వవిద్యాలయంలో 114మంది సిబ్బంది అవసరం ఉంటే కేవలం 63 మంది సిబ్బందితో నడుపుతున్నారన్నారు. సరైన విద్య అందక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పూర్తిస్థాయిలో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న యూనివర్సిటీ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ మృతిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి జనగామలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న నిరంజన్‌సింగ్ బోరియా మృతిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఒడిస్సాకు చెందిన నిరంజన్ సింగ్ బోరియా నెల రోజుల క్రితం ఇటుక బట్టీలో పనిలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం జయకుమార్ అనే తోటి కూలీతో కలసి నదిలో చేపలు పట్టుకుని వంట చేసుకుని తిన్నారు. కాసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుక బట్టీ నిర్వాహకులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిరంజన్‌సింగ్ బోరియా బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి బంధువు దుర్యోదన్ బోరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆహారం కలుషితం కావడమే లేక ఇతర కారణాలతో నిరంజన్‌సింగ్ మరణించాడా అనేది విచారణ తర్వాత స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

జూలపల్లి, సెప్టెంబరు 26. మండల కేంద్రానికి చెందిన అమరగాని చంద్రయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఈతచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగ గాయపడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా బుదవారం ఈత చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో వెన్నుపూసకు దెబ్బ తగిలి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని మండల గీతకార్మిక, గౌడ సంఘం నాయకులు కోరారు.

నేడు విద్యార్థి గర్జన సభ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: హైదరాబాదులో శుక్రవారం నిర్వహించనున్న విద్యార్థి గర్జనసభ పోస్టర్లను భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ గురువారం మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉంటే ఏ ఒక్క మండలానికి కూడా రెగ్యులర్ ఎంఈవో లేని పరిస్థితి ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల హాస్టల్స్‌లో దాదాపు అద్దె భవనంలో అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతూ కొనసాగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నా సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచడం లేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న హైదరాబాదులో జరిగే విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులను మేధావులను కోరారు. ఈ కార్యక్రమంలో విష్ణు, రమేష్, భాను చందు, మర్రి శంకర్, శ్రీను, భారత్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరి నదిలో గురువారం సుదర్శి బాలరాజు(29) అనే తాపీ మేస్త్రీ గల్లంతయ్యాడు. తనతో నిర్మాణ పనులు చేసే ఇద్దరు మేస్త్రీలతో కలసి నదీ స్నానానికి వచ్చాడు. సమ్మక్క గద్దెల సమీపంలో ప్రమాదవశాత్తు బాలరాజు జారి నదిలో పడడంతో కొట్టుకుపోయాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బాలరాజు కొద్ది కాలంగా స్థానిక కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటు స్థానికంగా భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.

మహిళను రక్షించిన అగ్నిమాపక దళ సిబ్బంది



హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో గురువారం మతిస్థిమితం లేని ఓ మహిళ బావిలో దూకగా, అగ్నిమాపకదళ సిబ్బంది కాపాడారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్సపల్లికి చెందిన మన్నాల శారద మతిస్థిమితం లేక గ్రామంలో పేద బావిలో దూకింది. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బావిలోకి దూకి శారదను ప్రాణాలతో కాపాడారు. మహిళను కాపాడిన ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, ప్రభాకర్, సందీప్, అనిల్‌కుమార్, శివారెడ్డిలను గ్రామస్థులు అభినందించారు.

ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఇన్‌చార్జి వీసీ అధికారి సురేంద్ర మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎత్తివేసి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెర క్రాంతి, శివ, ప్రవీణ్, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29న కొండగట్టులో ఆలయాల అర్చకులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 26: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలు ఆలయాల అర్చకులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ ఉజ్వల, రిసార్ట్స్ అధినేత మర్రిపెల్లి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తత్వం ఛారిటబుల్ ట్రస్టు అధినేత బంగారయ్యశర్మ, అతిథులుగా బిర్లామందిర్ ప్రధానార్చకుడు ఎం లక్ష్మీనరసింహాచార్యులు, దర్శనం మాసపత్రిక సంపాదకుడు మారుమాముల వేంకటరమణశర్మ, వేద, పురాణ, ఇతిహాస, ప్రవచన పండితులు పురాణం మహేశ్వరశర్మ, నంబి వేణుగోపాలాచార్యుల కౌశిక, రిసార్ట్స్ ఎండి కొండలరావు, ఏబీ6 న్యూస్ ఛానల్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్ హాజరవుతారిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల వారిచే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఔత్సాహికులు సెల్. 7382171021, 9059550280 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సమాజ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరిసిల్ల
ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26: సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ ఇన్ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ఇటీవల రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరగాయని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 26: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని మానేర్ నుండి ఇసుక లోడులతో వస్తున్న నాలుగు లారీలను శంబునపల్లి గ్రామంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ గురువారం రాత్రి పట్టుకున్నారు. లారీలను స్వాదీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం సీజ్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వద్ద ఓ వాహనంలో సంచుల్లో నింపి ఉన్న బ్యాగులను రవాణా చేస్తుండగా తాము పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా పలు చోట్ల డంపులు ఏర్పాటు చేసుకుని ఆ ఇసుకను జల్లెడ పట్టించి 25 నుంచి 30 కిలోల బ్యాగుల్లో నింపి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విషయం బయటపడిందని తహసీల్దార్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 22 గేట్లు ఎత్తిన అధికారులు


దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 22 వరద గేట్లు ఎత్తి 81,224 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 1,09,214 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా

మంథని, సెప్టెంబర్ 26: మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామ శివారులో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కన ఇసుక లారీ అదుపు తప్పి గురువారం బోల్తా పడింది. మండలంలోని అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ నుంచి కరీంనగర్‌కు లోడ్‌తో వెళ్తున్న లారీ గంగాపురి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ఈప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు. స్థానికులు లారీ క్యాబిన్ చిక్కున్న డ్రైవర్‌ను బయకు తీశారు. డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

వాటర్ ట్యాంక్ ఎక్కి పాత రేషన్ డీలర్ల ఆందోళన



వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేస్తున్న పాత రేషన్ డీలర్లు, పెట్రోల్ బాటిల్‌తో పాత మహిళ రేషన్ డీలర్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 26: తమ రేషన్ దుకాణాలు తమకివ్వాలని దాదాపు 30 మంది పాత రేషన్ డీలర్లు గురువారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. పోలీసులు వాటర్ ట్యాంక్‌పైకి రావాలని చూస్తే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు మహిళా డీలర్లు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న అడి షనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ అహ్మద్ బుజ్జగించే ప్రయత్నం చేశారు. కేవలం పాత్రికేయులు పైకి వెళ్లడానికి బాధితులు ఒప్పుకున్నారు. వాటర్ ట్యాంక్‌పైకి చేరిన పాత్రికేయులతో డిమాండ్లను వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల పట్టణం, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో 58 రేషన్ దుకాణాలతో పదేళ్లుగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తమకు సమాచారం లేకుండా దుకాణాలకు నోటిఫికేషన్ వేశారన్నారు. అనర్హులకు అధికార పార్టీ నాయకులు, అధికారులు రేషన్ దుకాణాలను ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని ఇచ్చి తమకు అన్యాయం చేశారని పాత మహిళా డీలర్లు కన్నీరు పెట్టుకున్నారు. డబ్బుల కోసమే తమ రేషన్ దుకాణాలను తమకుకాకుండా చేస్తే ఆ నాయకులకు, ఆ అధికారులకు బిచ్చమెత్తైన డబ్బులు ఇస్తామని, దుకాణాలు ఇవ్వండని వేడుకున్నారు. కలెక్టర్ స్పందించి తమ దుకాణాలు తమకివ్వాలన్నారు. కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడతామని పోలీసు అధికారులు, తహసీల్దార్ నచ్చజెప్పడంతో వాటర్ ట్యాంక్ దిగి వచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు

- మంత్రి ఉత్తమ్‌కు ఫోన్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ దుకాణాల కేటాయింపు వివాదం చర్చనీయాంశంగా మారింది. 54 దుకాణాలకు సంబంధించి రాత పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు జరిపినా కేవలం కాంగ్రెస్ సంబంధిచిన వారికే అడ్డదారిన ఇచ్చారనే దానిపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు బాధితులు గోడు వెళ్లబోసుకన్నారు. సిరిసిల్లలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాధితులు కేటీఆర్‌ను కలుసుకున్నారు. గతంలో మహిళ సంఘాల ద్వారా నిర్వహించిన వాటిని తొలగించిన విషయంతో పాటు అర్హతలు లేనివారికి కేటాయించడం ఇతర అవకతవకలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన అవకతవకలపై వివరించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలిస్తామని చెప్పారు. కేటీఆర్ సిరిసిల్ల ఆర్డీవోకు ఫోన్ చేయగా ఆయన ఫోన్ ఎత్తలేదు. ఆర్డీవో కార్యాలయంలోనే రేషన్ దుకాణాలపైనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలపై మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దానిపై కేటీఆర్ బాధితులతో హైకోర్టులో పిటిషన్ వేసే విషయంపై చర్చించారు. న్యాయ పోరాటం చేస్తామని ఎవరినీ వదిలేదిలేదని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.


కేటీఆర్‌కు సమస్యను చెప్పుకంటున్న బాధితులు

రామగుండం ఎన్టీపీసీకి
మూడు జాతీయ స్థాయి అవార్డులు

- ఇంధన పొదుపు, పవర్ ఎక్స్‌లెన్స్‌లో ఎకనామిక్ టైమ్స్ నుంచి పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, సెప్టెంబరు 26: రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ కన్‌జర్వేషన్(ఇంధన పొదుపు), పవర్ ఎక్స్‌లో మూడు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ప్రముఖ పబ్లికేషన్స్ సంస్థ ది ఎకనామిక్ టైమ్స్ ప్రతి ఏటా విద్యుత్ సంస్థలకు అవార్డులను అందజేస్తున్నది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీకి అందజేసింది. ఇంధన ఎదుపు అవార్డు(ఇండస్ట్రీస్), ఎనర్జీ కంపెనీ అవార్డు(పవర్), ఎనర్జీ కంపెనీ అవార్డులను(రిన్యూవబుల్) కేంద్ర ఇంధన శాఖ క్యాబినేట్ మంత్రి ప్రహ్లాద్ జోషి రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడుకు అందజేశారు. విద్యుత్ రంగంలో ఘనసీయమైన చరిత్ర ఉన్న రామగుండం ఎన్టీపీసీకి మరోసారి జాతీయస్థాయి పురస్కారాలు రావడంపట్ల ప్రాజెక్టులో హర్షం వ్యక్తం అవుతున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రాజెక్టు పలు రంగాల్లో అత్యుత్తమంగా పని చేయడం ద్వారా అనేక బెంచ్‌మార్కులను, రికార్డులను నమోదు చేసింది. ఇంధన పొదుపు, జనరేషన్, సాంప్రదాయేతర విద్యుత్, పర్యావరణం తదితర రంగాల్లో అవార్డులు సాధిస్తున్నది.

3 నుంచి రాజన్న ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


విగ్రహాలను శుద్ధి చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో అక్టోబరు 3వ తేది శనివారం నుంచి దేవినవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో గురువారం శ్రీదేవినవరాత్రోత్సవాలకు మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో శ్రీదేవినవరాత్రోత్సవాలు అక్టోబరు 3వ తేది శనివారం నుంచి 12వ తేది శనివారం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేది బుధవారం రోజున ఉదయం 9 గంటలకు మూలా నక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10 తేది గురువారం రోజున దుర్గాష్టమిని పురష్కరించుకుని ఉదయం 8.30 గంటలకు నుంచి చండీ అమ్మవారి వద్ద శ్రీచండీకలశప్రతిష్ఠ, చండీ సప్త శతీ హవనము చేపట్టగా రాత్రి 8 గంటలకు శ్రీమహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ జరగనున్నాయి. 11వ తేది శుక్రవారం రోజున ఉదయం 11.05 గంటలకు పూర్ణాహుతి, బలిహరణ రాత్రి 8.30 గంటలకు నుండి అమ్మవారిక ధర్మగుండంలో తెప్పోత్సవము నిర్వహించనున్నారు. 12వ అది శనివారం రోజు విజయదశమి (దసరా)ను సందర్భంగా ఉదయం 10.45 గంటలకు ఆలయుధపూజ, సాయంత్రం 5 గంటలకు నుంచి స్వామి వారి పెద్దసేవ (అంబారీ సేవ)ను, స్వామి వారి అమ్మవార్ల శమీపూజ, అపరాజిత పూజ చేపట్టానున్నారు. శ్రీదేవినవరాత్రోత్సవాలతో ప్రతినిత్యం సాయంత్రం 4 గంటలకు శ్రీమత్ దేవీభాగవత పురాణ ప్రవచనము నిర్వహించడంతో పాటు స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దాడి?

- కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రా నికి చెందిన కుందారపు గంగాధర్ అనారోగ్యానికి గురి కావడంతో అతని కుమారుడు నరేష్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించాడు. చికిత్స అందించే విషయంలో వైద్యులతో పాటు సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణతో నరేష్ పలు ఘటనలను తన ఫోన్‌లో వీడియో ద్వారా బుధవారం రాత్రి చిత్రీకరించాడు. దీంతో సదరు వీడియోలను డిలీట్ చేయాలని కోరుతూ కింది స్థాయి సిబ్బంది ఒకరు నరేష్‌పై దాడికి పాల్పడ్డట్లు బాధితుడు కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, ప్రాథమికంగా విచారణ చేశామని, రోగి బంధువు, సంబంధిత సిబ్బంది మధ్య పాత గొడవలున్నట్లుగా తెలుస్తోందని స్పష్టం చేశారు. మరింత లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలకు కార్పొరేషన్ అధికారుల నోటీసులు

- తమ తప్పేమిలేదంటున్న నిర్మాణదారులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: రామగుండం నగరపాలక సంస్థ 5వ డివిజన్ పరిధిలోని మల్లపురాణి కుంట ఎఫ్‌టీఎల్‌లో 16 భవనాలకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఆదేశానుసారం నోటీసులు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వే చేసి మల్లపురాణికుంటకు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించారు. 16 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉండగా 36 నిర్మానాలు శిఖంలో ఉన్నాయి. శిఖంలో ఉన్న నిర్మాణాలను తొలగించుకోవాలని ఇప్పటికే కార్పొరేషన్ సమాచారం ఇచ్చింది. గురువారం ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. కాగా బఫర్ జోన్‌లో కూడా చాలా నిర్మాణాలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా వినాయకనగర్ వాసులు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. తాము నిర్మించుకున్న నివాసాలకు గతంలో రెవెన్యూ నాలా కన్వర్షన్ ఇచ్చిందని, ఇరిగేషన్ ఎన్‌ఓసీలు ఇచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్లు ఇచ్చిందని, అలాంటప్పుడు మా తప్పు ఎలా అవుతుందంటూ పేర్కొన్నారు. కాగా నోటీసులకు రాతపూర్వక సమాధానం ఇవ్వాలని, తాను అధికారులకు నివేదిస్తానని టీపీఎస్ నవీన్, నిర్మాణదారులతో పేర్కొన్నారు. కాగా మల్లపురాణికుంట శిఖం భూముల్లోని నిర్మాణదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలా ఆక్రమణలు, చెరువుల ఆక్రమణలపై పరిశీలన జరిపారు. త్వరలోనే యాక్షన్ ప్లాన్ చేపడుతారనే ప్రచారం జరుగుతున్న సందర్భంలో నోటీసులు కలకలం రేపాయి. వినాయక నగర్ ఎఫ్‌టీఎల్ నిర్మాణ బాధితుల్లో పోలీస్‌శాఖకు చెందిన పలు కుటుంబాలు ఉన్నాయి.


కార్పొరేషన్ టీపీఎస్‌తో మాట్లాడుతున్న వినాయకనగర్ వాసులు

జెన్‌కో ద్వారానే విద్యుత్‌కేంద్రం నిర్వహించాలి


నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: సింగరేణికి నూతన ప్రాజెక్టులో భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ, జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ సర్కిల్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో ద్వారా నిర్వహించిన 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేయడానికి నిర్ణయించారన్నారు. దాని స్థానంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి, జన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. నూతన విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని ఉద్యోగ,కార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, వీరయ్య, సంపత్ కుమార్, శ్రీనివాస్, జనార్ధన్, స్వామి, సుధీర్ కుమార్, కిరణ్ ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త చెరువు నాలాలపై
ఆక్రమణలను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26 : సిరిసిల్ల కొత్త చెరువు నాళాలు, శాంతినగర్ రొడ్డం ఆక్రమణాలను తొలగించాలని గురువారం ఏఐఎఫ్టీయూ (న్యూ)నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో కొత్త చెరువుకు సంబంధించిన నాళాలు, రొడ్డం 16 సంవత్సరాలుగా ఆక్రమణాలకు గురవుతున్నాయన్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రవీందర్, ఎర్రజెండా పవర్ లూం కార్మిక సంఘం జిల్లా నాయకుడు బొద్దుల శ్రీహరి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 26: మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25)మద్యానికి బానిసై గురువారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సాయి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు ఏర్పడటంతో అతడి భార్య ఏడాది క్రితం ఇంటి నుంచి వెల్లిపోయింది. అనస్థాపానికి గురైన సాయి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సాయి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై వివరించారు. ఇదిలా ఉండగా తన చావుకు ఎవరూ కారణం కాదని, మద్యానికి బానిసై అందరినీ బాధపెట్టానని తనను క్షమించాలని రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో లభించింది.

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 26: కారుకొనివ్వలేదని ఇంట్లోనుంచి పారిపోయి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం రాగిల్ల గ్రామానికి చెందిన దేతపు వంశీ (20) కారు కొనివ్వాలని ఇంట్లో తరచూ తల్లిదండ్రులను అడిగేవాడు. కారు కొనివ్వకపోవడంతో వంశీ మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన వంశీ కనిపించకుండా పోయాడు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులోని గుట్టప్రాంతంలో వంశీ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం తెలిసింది. మృతుడి తండ్రి రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి ఒక్కసారిగా కోతి అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కమాన్‌పూర్ మండలానికి చెందిన బూడ రాజు అనే వ్యక్తి ముత్తారం మండల కేంద్రంలో విద్యుత్తు లైన్ల సవరణలో కాంట్రాక్టు లేబర్‌గా విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపాడు. తలకు తీవ్రగాయాలు కాగా అక్కడే ఉన్న కానిస్టేబుల్, స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాషిక్యూషన్ వివరాల ప్రకారం.... చందుర్తి మండలంలోని అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కట్కూరి స్వామి, గంగుల శ్రీను, చింత శేఖర్‌లకు బావి పంచాయతీ విషయంలో తరుచు గొడవలు తలెత్తాయి. ఈ గొడవల్లో భాగంగా రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశ్యంతో స్వామి, శ్రీను, శేఖర్‌లు కర్రతో దాడిచేశారు. ఈ దాడిపై బాధితుడు రాంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్ఐ నీలం రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్ఐ రవిందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్‌లు తిరుపతి, లతీఫ్, సిఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ మధులు 11మంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సబ్‌కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ నిందితులపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: గోదావరిఖని గాంధీనగర్‌లో పొరిగింటివారితో వివాదం కారణంగా కోరె శంకర్ అనే సింగరేణి కార్మికుడు గురువారం సాయంత్రం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొరిగింటి వారితో వివాదంలో మహిళ శంకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంకర్ కూడా ఆమెపై ఫిర్యాదు చేశాడు. ఈ వివాదంలో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పనిలో నుంచి తొలగించారని మెడికల్ కళాశాల కార్మికుడు..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: తనపై అకారణంగా కేసు పెట్టి విధుల నుంచి తొలగించారంటూ గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో గురువారం మసూద్ అనే కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంట్రాక్టర్ తరుణ్ మెడికల్ కళాశాలకు రాగా మసూద్ అతనితో వాగ్వాదానికి దిగి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

గంజాయి పట్టివేత: నలుగురు నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26: కరీంనగర్ శివారులోని రేకుర్తిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 223 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించగా నలుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. చింతకుంటకు చెందిన నెలమడుగు హరీష్, ధర్మారం రవి, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన మాచర్ల రవితేజ, రేకుర్తి గ్రామానికి చెందిన షేక అఫ్జల్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు ఖాసీంబి, కమలాకర్, సంతోష్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడంలో ఎన్‌పీడీసీఎల్ నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఎఫ్‌సీఐ గౌతమినగర్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో హై వోల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో 24 ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇతర విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. గౌతమినగర్ హౌసింగ్ సొసైటీలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా చెట్ల కొమ్మలతో వైర్లు తగులుతున్నాయని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది పట్టించుకోలేదని గౌతమినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. పైగా హై వోల్టేజీతో నష్టం జరిగితే కోతులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్‌పీడీసీఎల్ అధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా చూడాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు, సెప్టెంబరు 26: మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన మారం సతీష్(34)అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సతీష్ ఈనెల 22న బిల్డింగ్ మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారీ కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి ముక్కు, చెవుల నుంచి రక్తం కారింది. గమనించిన అతడి భార్య మధవి కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

పాలకుర్తిలో సఫాయి మిత్ర సురక్షా శిబిరం

పాలకుర్తి, సెప్టెంబర్ 26: మండల పరిధిలోని పుట్నూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సఫాయి మిత్ర సురక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పొల్సాని శశికళ, ఆసుపత్రి ప్రధాన వైద్యుడు సాయిసూర్య, ఎంపీవో సుదర్శన్, ఎస్ సుమలత, జి సంతోష్, పెండ్లి సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

పాలకుర్తి, సెప్టెంబర్ 26: మండలం పరిధిలోని బసంత్ నగర్, కన్నాల తదితర ప్రాంతాల్లో గురువారం అటవీ శాఖ అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫారెస్టు రేంజర్ నాగయ్య, ఎంపీడీవో పొల్సాని శశికళ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాసు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

పాలకుర్తి, సెప్టెంబర్ 26: నల్లగొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ గురువారం మండలం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు.

కార్యవర్గం ఎన్నిక

పాలకుర్తి, సెప్టెంబర్ 26: మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా వైద్య నరేష్‌ప్రధానకార్యదర్శిగా మాదాసు భూమయ్య, కోశాధికారిగా సంఘం ప్రకాష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

పాలకుర్తి, సెప్టెంబర్ 26: మండలం పరిధిలోని ఎల్కలపల్లి, పాలకుర్తి, బసంత్‌నగర్‌లోని జీడినగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను గురువారం గుర్తించిన తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ ఇంతియాజ్‌లు, రెవెన్యూ సిబ్బంది సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అట్టి భూములను ఎవరూ అక్రమించరాదని బోర్డుల్లో పేర్కొన్నారు.

నేత్రాలు సజీవం..

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 26: మండల కేంద్రంలో గోలి చిన్న చంద్రయ్య(70) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని నేత్రాలను సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐ బ్యాంకుకు అందజేసినట్లు మృతుని బంధువులు తెలిపారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి మృతుని కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెగులు రాకుండా చర్యలు తీసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 26: సన్నవరికి దోమపోటు, తెగులు రాకుండా రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి నాగార్జున అన్నారు. గురువారం మండలంలోని మొట్లపల్లి, కిష్టంపేట గ్రామాల్లోని వరి పంటలను వ్యవసాయాధికారి నాగార్జున పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తగిన సూచనలు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 26: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ ఎండి వకీల్ గురువారం ఎలిగేడు మండలం శివపల్లెలో మర్యాద పూర్వకంగా కలిశారు. భూసమస్యలపై రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, బుక్స్ పంపిణీ

ఎలిగేడు, సెప్టెంబర్ 26 : యూత్‌ఫర్ సేవా భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సుల్తాన్‌పూర్‌లో గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్, బుక్స్ జామెట్రీ బాక్స్‌లు, 8వ తరగతి విద్యార్థులకు (ఎన్ఎంఎంఎస్)బుక్స్ అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు తాటిపల్లి సతీష్‌బాబు, రాగి సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 26 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలలో గుండారం, కమాన్‌పూర్, పేరపల్లి, జూలపల్లి, నాగారం గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి గురువారం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాల నిర్వహణ తీరును ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజమౌళి, మధుసూదన్‌లు పర్యవేక్షించారు. డాక్టర్లు స్వాతి, సింధూర పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: సుల్తానాబాద్ మండల పరిషత్ క్వార్టర్స్‌లో గురువారం పిచ్చిమొక్కలు తొలగింపు చేపట్టారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దాంతో అధికారులు గురువారం క్వార్టర్లలో క్లీనింగ్ చర్యలు చేపట్టారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో పర్యవేక్షణలో పరిశుభ్రత పనులు చేయించారు. అలాగే మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో కూడా పనులు చేశారు.



గోదావరిఖనిలో నివాళులర్పిస్తున్న నాయకులు





మంథనిలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: పీడిత ప్రజల విముక్తి కోసం నడుం బిగించి చాకలి ఐలమ్మ పోరాటం చేసిందని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం గోదావరిఖని గాంధీనగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కొండపర్తి సంజీవ్, రమేష్, దేవయ్య, రాజేశం, దుర్గాప్రసాద్, రాజయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

మంథని : తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మంథని రజక సేవా సంఘం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు వేర్వేరుగా గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సేవా సంఘం నేతలు, బీఆర్ఎస్ మండల, టౌన్ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్‌లు వేర్వేరుగా పూలమాలలు వేయగా, స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కాంగ్రెస్ నేతలు ఐలమ్మ చిత్రపటానికి వేర్వేరుగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, రజక సంఘం నేతలు పైడాకుల నాగరాజు, పోతరాజు శ్రీనివాస్, కొల్లూరి రాజయ్య, సమ్మయ్య, కొండపర్తి బాపు, శంకర్, చంద్రగిరి లింగయ్య, కాయితి సమ్మయ్య, గొబ్బూరి వంశీ, ఆసీఫ్‌ఖాన్, ఇర్ఫాన్, ఆరెపల్లి కుమార్, గోటికార్ కిషన్‌జీ, పేరవేన లింగయ్య యాదవ్‌లు పాల్గొన్నారు.

ధర్మారం : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ధర్మారంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు రాము, కాల్వ నర్సింగం, మల్లేష్, ఎల్లయ్య, రామడుగు శ్రీనివాస్, కోడిపుంజుల రమేష్, కొత్తకొండ గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని పలు గ్రామాలతో పాటు కుక్కలగూడూర్‌లో గురువారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు నగునూరి రమేష్, యూత్ అధ్యక్షులు కట్కూరి చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రాజయ్య, ఓగెటి రమేష్, ఓగెటి నది, దొమ్మటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు తోటపల్లి వెంకటేషం, మిట్టపల్లి కనుకయ్య, బొడ్డుపల్లి రాజేశం, పోచయ్య, రాజేశం, సంపత్, శ్రీనివాస్, రాకేష్, కల్వల తిరుపతి గౌడ్, ఆంజనేయులు, తోటపల్లి రాజేశం, అంజి, వెంకటేశం, బద్రి పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిం చారు. ఐలమ్మ చిత్రపటానికి చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బిరుదు క్రిష్ణ, రాజయ్య, సంపత్, రఫీక్, తిరుపతి, రాజు మేనేజర్ అలీమోద్దీన్, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం మండల అధ్యక్షులు నిట్టూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నిట్టూరి రాజేశం, మాజీ అధ్యక్షుడు మైసయ్య, అంజయ్య, మధురయ్య, ఆనంద్, కృష్ణ, శ్రీనివాస్, దీపక్, సంతోష్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ శ్రీనివాస్

ఓదెల : భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన సాయుధ సమరంలో చాకలి ఐలమ్మ తెగువ మరువలేనిదని పలువురు నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో రజకుల ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రంగౌడ్, నాయకులు రంగు సత్యనారాయణగౌడ్, అంబటి కనకయ్య, జంగపల్లి అజయ్, గుర్రం లక్ష్మీమల్లు, అనవేణి లక్ష్మీరాజం, నీలం శ్రీనివాస్, పెద్ద శ్రీనివాస్, చిన్న శ్రీనివాస్, సత్యనారాయణ, కుక్క రవీందర్, గీస సంపత్ కుమార్, మల్యాల నరేష్, తాటికొండ రవి, దాసరి రామచంద్రం, గంధం కృష్ణ, నరసయ్య, శ్రీనివాస్, సారయ్య తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్

ఎలిగేడు : వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, భైరెడ్డి రాంరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు తానిపర్తి మోహన్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, కొండ తిరుపతిగౌడ్, గోపు లక్ష్మరెడ్డి, ముంజంపల్లి కొమురయ్య, లచ్చయ్య, వంశీ, ఓదెలు, రాజేశ్వం పాల్గొన్నారు.

కోల్‌సిటీ : తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం రామగుండం పోలీస్ కమిషరేట్‌లో నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెత్తందారుల దురాగతాలను ఎదురించి రజాకార్లకు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటాలు చేసిందన్నారు. ఆమె పోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి అయ్యిందన్నారు. మహిళ చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, మహిళలందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, రవీందర్, అజయ్‌కుమార్, ఆరె దామోదర్, మల్లేష్, శ్రీనివాస్, వామన్‌మూర్తి, సంపత్ పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో...

రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. మేయర్ బంగి అనీల్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాజు, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, నగునూరి సుమలత, బాల రాజ్‌కుమార్, రాకం వేణు, శంకర్‌నాయక్, శ్రీనివాస్, నాయకులు దుబాసి మల్లేష్, పాతిపెల్లి ఎల్లయ్య, సంజీవ్ పాల్గొన్నారు.



ధర్మారంలో నివాళులర్పిస్తున్న కొప్పుల ఈశ్వర్



పెద్దబొంకూరులో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు



ఓదెలలో నివాళులర్పిస్తున్న నాయకులు

తాగునీటి సరఫరాలో లోపాలను నివారించాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 26 : గ్రామాల్లో తాగునీటి సరఫరాలో తలెత్తే చిన్న చిన్న లోపాలను నివారిస్తూ ప్రజలకు సక్రమంగా నీటిని అందించడంలో శిక్షకులు భాగస్వాములు కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రక్షిత మంచినీటి పథకం, మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాల తాగునీటి సహాయకులకు శిక్షణ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఈఈ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా, లీకేజీల నివారణ, మరమ్మతులు, తదితర అంశాలపై శిక్షణ పూర్తి చేసుకున్నారని, గ్రామాల్లోని ఆయా వీధుల్లో పైప్‌లైన్‌ల లీకేజీ, చిన్న చిన్న విద్యుత్ సమస్యలు, మరమ్మతులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ సతీష్, ఏఈ మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: ఆర్జీ-2 ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులతో జరిగిన సమావేశంలో అశోక్ మాట్లాడారు. కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, కాంట్రాక్టర్లు వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వేధింపులకు గురిఅవుతున్నట్టు అశోక్ పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఈధర్నాకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు హాజరై విజయవంతం చేయాలని అశోక్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లింగారెడ్డి, రమేష్, రవీందర్, నరేష్, రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీడీకే 11ఇంక్లైన్‌లో ప్రమాదం

- కంటిన్యూయస్‌మైనర్‌పై కూలిన బొగ్గు

గోదావరిఖని, సెప్టెంబరు 26: ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో గురువారం మొదటి షిప్టులో కంటిన్యూయస్ మైనర్‌పై బొగ్గు కూలడంతో కంటిన్యూ యస్ అందులో చిక్కుకుపోయింది. బొగ్గు కూలడంతో అక్కడ పనిచేస్తున్న కార్మి కులు తప్పించుకుని బయటకు వచ్చారు. కంటిన్యూయస్‌మైనర్‌పై కూలిన బొగ్గును తొలగించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

స్వచ్ఛత క్యాంపెయినింగ్‌పై జీఎం సమీక్ష

రామగిరి, సెప్టెంబరు 26: సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత క్యాంపెయినింగ్‌పై గురువారం జీఎం కార్యాలయంలో అధికారులతో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ క్యాంపెయినింగ్‌కు తీసుకోవాల్సిన విధివిధానాలపై అధికారులతో చర్చించారు. కార్యాలయాలు, కాలనీలోని పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రాజారెడ్డి, వెంకటరమణ, సుదర్శనం, రాజేంద్రప్రసాద్, ఐలయ్య, కళ్యాణ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీ-1 సీహెచ్‌పీలో ప్రమాదం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టులో గురువారం జరిగిన ప్రమాదంలో సత్యనారాయణ అనే ఫిట్టర్ గాయపడ్డాడు. సీహెచ్‌పీలో ఫీడర్ బెల్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ప్రమాదవశాత్తు కన్వేయర్ బెల్ట్ కింద కాలు ఇరకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట బీఎంఎస్ ధర్నా

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట గురువారం బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడారు. సీఎంపీఎఫ్‌లో జరిగిన వెయ్యి కోట్ల కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలు 4,701కోట్ల నుంచి 33శాతం వాటా 1551 కోట్లు కార్మికులకు చెల్లించాలన్నారు. లాభాల వాటాలో రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మికులను మోసం చేశాయన్నారు. సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలను నిర్మించాలని, ఆధునిక వైద్య పరికరాలు, నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పెర్క్స్ మీద ఐటీని కార్మికులకు రీయంబర్స్ చేయాలని, ప్రభావిత గ్రామాల యువతకు ఉపాధి చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సొంత ఇంటి పథకం అమలు చేయాలని, రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా కార్మిక వాడలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని సింగరేణి స్కూల్‌లలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలని, గ్రూప్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలకు కార్మికుల పిల్లలకు కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. 11వ వేజ్‌బోర్డులో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని, రిటైర్ కార్మికులకు కొత్త పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఆర్ఎంఎస్ పథకం కింద నగదు రహిత వైద్య సేవలు అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో సారంగపాణి, మాదాసు రవీందర్, వడ్డెపల్లి కుమారస్వామి, ప్రమోద్‌కాషల్, అరుకుల ప్రసాద్, రౌతు రమేష్ మహేష్, నరేష్, అబ్బోజు శివాజీ, మల్లికార్జున్ పాల్గొన్నారు.



జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

బీఎంఎస్ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి, సెప్టెంబరు 26: బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం బీఎంఎస్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఆర్జీ-3 డివిజన్‌లోని సెంటినరీకాలనీలోని బీఎంఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం జీఎం కార్యాలయంలో చేపట్టబోయే ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, బ్రాంచి సెక్రెటరీ రౌతు రమేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి స్వామి, మర్రి సంతోష్, పాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ముత్తారం, సెప్టెంబర్ 26: మండలంలోని దర్యాపూర్ గ్రామంలో దొమ్మటి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి తోటి యూనియన్ సభ్యులంతా ముందుకొచ్చారు.మృతుడు దొమ్మటి శంకర్ వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్ కాగా తన తోటి యూనియన్ సభ్యులందరూ కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి యూనియన్ అధ్యక్షులు రాపల్లి రాజయ్య చేతులు మీదుగా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తిత్తుల శ్రీను, ప్రశాంత్, సతీష్, రాజ్‌కుమార్,మొగిలి ఉన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: మండలంలోని గర్రెపల్లి సోషల్ వేల్ఫేర్ గురుకుల విద్యాలయంకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ గిరిజ, పీడీ జాహ్నవి తెలిపారు. రేగడిమద్దికుంటలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో వీరు జిల్లా స్థాయికి ఎంపికయినట్లు వివరించారు. అండర్-14 ఇయర్స్ విభాగంలో స్నిగ్ధిత, వర్షిని, ఆక్షేయలు, అండర్-17లో హృతిక, ఖోఖోలో సాయిదీప్తి, విసీల, 400 మీటర్స్ రన్నింగ్‌లో సాయిదీప్తి, దీప్తి, శ్రీగంగ, అక్షిత, కబడ్డీలో సన్నిహిత, డిస్కస్‌త్రోలో అక్షిత తదితరులు ఎన్నికయినట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

బాలల రక్షణ, సంరక్షణ చట్టాలపై అవగాహన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 26: గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో గురువారం బాలల రక్షణ, సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కో ఆర్డినేటర్ బి.ఉమాదేవి, కౌన్సిలర్ ఆర్. సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వారి హక్కులకు ఇబ్బందులు కలిగితే 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇజ్రాయిల్, ఉపాధ్యాయులు గడ్డం జగదీశ్వర్, భూమయ్య, రాజేశ్వరి, శంకరయ్య, రమాదేవి, ప్రేమ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో..

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 26 : పిల్లల భద్రతకు ప్రభుత్వం 1098 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిందని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న, ఫైనాన్స్ లిటరసీ సేరు సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు హెల్ప్‌లైన్ నెంబర్‌లు, వాటి ఉపయోగాలపై మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 26: విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటూ విద్యతో పాటు శాస్త్ర, సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా అన్నారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమయాన్ని వృధా చేయకుండా ప్రతి రోజు నూతన విషయాలు నేర్చుకుంటూ తమ లక్ష్యాన్ని చేరుకోనేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 21024-25 విద్యాసంవత్సరం నుంచి రెగ్యులర్ డిగ్రీతో పాటు మినీ డిగ్రీ కోర్సుగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)ను మంజూరు చేసినందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ప్రిన్సిపల్ జై కిషన్‌ఓజా, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి వి.ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ యూనివర్సిటీలలో పీజీ సీట్లు సాధించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ సాంబశివరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఎఫ్ఎస్ఐ కోర్సుకు మంథని డిగ్రీ కళాశాల ఎంపిక

మంథని, సెప్టెంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బ్యాంకింగ్, ఫైనాన్సియల్, సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) స్కిల్ ప్రోగాం కోర్సుకు మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయ్‌కిషన్‌ఓజా గురువారం తెలిపారు. రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రాష్ట్రంలోని 20 డిగ్రీ కళాశాలల్లో, 18 ఇంజనీరింగ్ కళాశాలల్లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమానికి తాను కూడా హాజరైనట్లు తెలిపారు. తమ కళాశాలను ఎంపిక చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ : సీఐ

ఓదెల, సెప్టెంబరు 26: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తిలో గురువారం పెద్దమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆస్తులను కాపాడుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడడమే కాకుండా నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి, చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం సీఐ, ఎస్సైలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చిట్ల శ్రీనివాస్, పిట్టల కొమురయ్య, సమ్మయ్య, యాదగిరి కిష్టయ్య, రాయిల్ల రాజేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త అంత్యక్రియల్లో ఎమ్మెల్యే.



కాంగ్రెస్ కార్యకర్త అంత్యక్రియల్లో పాడె మోస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, సెప్టెంబర్ 26 : మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ కార్యకర్త కొప్పర తిరుమల్‌రెడ్డి (45)మృతి చెందాడు. ఆయన నెలరోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి మృతదేహాన్ని లాలపల్లికి తీసుకొనిరాగా గురువారం ఉదయం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొని పాడె మోశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్‌లు గోపు విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, మాజీ సర్పంచ్‌లు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, బాసంపల్లి కొండయ్య, సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి రాంరెడ్డి, తానిపర్తి మోహన్‌రావు, కొండ తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 26 : మండలంలోని రాఘవపూర్‌రెడ్డి వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పెద్దపల్లి మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల శాఖ సూపరింటెండెంట్ కొట్టె రాజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, జిల్లా మహిళ సాధికారిక కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న, ఫైనాన్స్ లిటరసీ సేరు సంధ్యారాణి, వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు రాంచందర్, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వృద్ధులు పాల్గొన్నారు.